క్లుప్తంగా

నేడు గడప గడపకు మనప్రభుత్వం

ఊటుకూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరులో శుక్ర, శనివారాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజాసమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు.

క్రమబద్ధీకరించడం మంచి నిర్ణయం

మైలవరం: కాంట్రాక్ట్ ఉద్యోగులు 2014 ముందు ఉన్న వారిని క్రమబద్ధీకరించడం, సీపీఎస్ రద్దు చేసి వీలైనంత ఎక్కువ మేలు జరిగే విధంగా జీపీఎస్ విధానం తీసుకురావడం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమని పీఆర్టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షకార్యదర్శులు పీ. గోపాల్, ఎం. వెంకటేశ్‌లు గురువారం తెలిపారు. కొత్త పీఆర్సీ కమిటీ వేయడం చాలా శుభ పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అభినందనలు తెలిపారు. ముదిరిన ఎండలు పరిగణలోకి తీసుకుని పాఠశాలల రిఓపేన్‌ను జూన్25వ తేదీకి మార్చాలని కోరారు.

ఫిజికల్ స్టాంప్ పేపర్లు అవసరం లేదు

మైలవరం: రిజిస్ట్రేషన్ల కోసం ఫిజికల్ స్టాంప్ పేపర్లు అవసరం లేదని మైలవరం సబ్ రిజిస్ట్రార్ జగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఈ-స్టాంప్ వాడాలని పేర్కొన్నారు. ఫిజికల్ స్టాంపు పేపర్లు త్వరలో నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ-స్టాంప్ పేపర్లు వినియోగదారులు సమీపంలోని అధీకృత కలెక్షన్ సెంటర్ ఎంపిక చేయబడిన బ్యాంకులు, విక్రయదారులు వద్ద అన్ని విలువలతో రూ.100, రూ.50 దొరకుతాయని పేర్కొన్నారు. ఈ స్టాంపులు దొరికే ప్రదేశాలు కొరకు www.refirtration.ap.gov.in, ww-w.rhciertamp.com సందర్శించవలసిందిగా తెలిపారు. ఎటువంటి సందేహాలకైనా సమీపంలోని సబ్ రిజిస్ట్రార్/ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ అర్ధరాత్రి విధులు

ఇబ్రహీంపట్నం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అర్ధరాత్రి విధులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం రాత్రి 12 గంటల వరకు కార్యాలయం డోర్ తీసి ఉండడంతో స్థానికులు పోలీసులు, మీడియాకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న ఎస్ఐ పాపారావు కార్యాలయంలో తనిఖీ చేశారు. సబ్‌రిజిస్ట్రార్ ఏవీ సింగ్‌తో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో కార్యాలయం తీయడం ఏమిటని సబ్ రిజిస్ట్రార్‌ను ఎస్ఐ ప్రశ్నించగా మార్కెట్ వ్యాల్యూ చెక్ చేసుకుంటున్నామని బదులిచ్చారు. అయితే మద్యం సేవించేందుకే అర్ధరాత్రి వరకు కార్యాలయంలో ఉన్నట్లు ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ విషయంపై సబ్‌రిజిస్ట్రార్ సింగ్‌ను వివరణ కోరగా ప్రభుత్వం భూముల ధరలు పెంచడంతో మార్కెట్ వ్యాల్యూ కంప్యూటర్లలో ఫీడింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్‌గా చంద్రశేఖర్



విస్సన్నపేట: స్థానిక తహసీల్దార్‌గా డి.చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పని చేసిన కె.లక్ష్మి విజయవాడ బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో చంద్రశేఖరరావు విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయం నుండి విస్సన్నపేటకు బదిలీపై వచ్చారు.

సోషల్ పరీక్షకు 92 మంది గైర్హాజరు

నూజివీడు: పదో తరగతి సప్లిమెంటరీ సోషల్ పరీక్షకు గురువారం 92 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 324 మందికి 232 మంది పరీక్ష రాశారు. నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ సెంటర్‌లో 77 మందికి 59 మంది, బాలికల జెడ్పీ హైస్కూల్‌లో 67 మందికి 48 మంది, సెయింట్ థామస్ హైస్కూల్లో 56 మందికి 40 మంది, సెయింట్ ఆన్స్ హైస్కూల్లో 49 మందికి 30 మంది, లేయాజోన్స్ హైస్కూల్లో 75 మందికి 55 మంది హాజరయ్యారు.

నూజివీడు ఎంపీడీఓగా విజయ్‌కుమార్



నూజివీడు: స్థానిక ఎంపీడీఓగా వీఏ విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పామర్రు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన ఆలీఖాన్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులందరికీ అందేలా చూస్తానని విజయ్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనకు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

– ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

రామచంద్రాపురం(విస్సన్నపేట): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని కలగర సచివాలయం పరిధిలో రామచంద్రాపురం గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న బ్రోచర్‌ను అందజేశారు. కలగర సచివాలయం పరిధిలో 6,260 మంది లబ్ధిదారులకు రూ.15,84,71,376 అందజేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఇతర అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలకే ఒక సచివాలయానికి ఇన్ని కోట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాలు అమలు చేయడం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లిపథకాలను అందించడం జరుగుతుందన్నారు. మండలంలో నాయకులు, అధికారులు ప్రోత్సాహంతో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేయడం జరిగిందని, తనకు సహకరించిన వారందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విస్సన్నపేట ఎంపీటీసీ జి.మల్లయ్య పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే ఎంపీటీసీకి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ దేశిరెడ్డి రమ, ఎంపీటీసీ వాసం పుల్లమ్మ, వైస్ ఎంపీపీలు ఆర్ శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి,సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివబాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.

ఆర్పీల సాంకేతిక సమస్య పరిష్కరించాలి



మంత్రి జోగి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా ఆర్పీలు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలో డ్వాక్రా రిసోర్స్ పర్సన్లకు సంబంధించి టెక్నికల్ సమస్య తొలగించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను ఆర్పీలు కోరారు. ఇబ్రహీంపట్నంలో గురువారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు సేవలందించిన ఆర్పీలను మున్సిపాల్టీ అయిన తర్వాత మెప్మాలో విలీనం చేశారు. మెప్మాలో ఆన్‌లైన్ చేసేందుకు 42ఏళ్ల వయోపరిమితి అడ్డు రావడంతో వీరందరికీ ఆన్‌లైన్ సమస్య ఏర్పడి వేతనాలు నిలిచాయి. మంత్రి జోగి రమేష్ మెప్మా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారం చేసి పెండింగ్ వేతనాలు కూడా చెల్లించాలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి హామీతో ఆర్పీలు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠా మహోత్సవ పూజలకు ఏర్పాటు చేసిన యాగశాల

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతా లక్ష్మణ హనుమాన్ సమేత కోదండ రామస్వామి ఆలయ విగ్రహ, విమాన గోపుర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోడేపూడి అప్పారావు నూతన ఆలయం నిర్మించారు. ఈ నెల 12వ తేదీన జరిగే విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఈ నెల 9వ తేదీ నుంచి విశేష పూజలు, యాగశాల ప్రవేశం, కుంభారాధన, నిత్య పూర్ణాహుతి, హోమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠా మహోత్సవం విజయవంతం చేయాలని వారు కోరారు.

13న సింగిల్ మేజర్ డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహన

మైలవరం: జాతీయ విద్యా విధానం-2020 నిబంధనలను అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సాంప్రదాయక మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సుల స్థానంలో నూతనంగా నాలుగు సంవత్సరాలు డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశ పెడుతుందని స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి గురువారం తెలిపారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈనెల 13వ తేదీన కళాశాల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి అమలు కానున్న ఈ కోర్సులలో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా ఒకటే మేజర్ సబ్జెక్టు ఉంటుందని పేర్కొన్నారు. గతంలో బీఎస్సీ, ఎంపీసీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా చదువుకునే విద్యార్థులు సింగిల్ మేజర్ విధానంలో బీఎస్సీ మ్యాథ్స్ లేదా బీఎస్సీ కెమిస్ట్రీ చదువుతారని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న సదస్సులో కృష్ణా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే రమామోహనరావు ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథిగా ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అకాడ మిక్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరంగం మాధ్యూ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నూజివీడు: మండలంలోని 29 పంచాయతీల్లో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ గురువారం ప్రారంభించారు. ఈ పథకంలో మండలంలో రూ.17.50 కోట్ల వేతన విలువ గల పనులను చేశారు. వీటిలో రూ.13 కోట్ల విలువైన వేతన విలువ పనులను, రూ.4.50 కోట్ల విలువైన మెటీరియల్ పనులపై సామాజిక తనిఖీ చేయనున్నారు.

11న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ పంచాయతీ పరిధిలోని ఆదర్శ పాఠశాల నందు ఆరో తరగతిలో చేరేందుకు ఈనెల 11వ తేదీన(ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహించడం జరుగుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ వీరరాజు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేర్చుకునేందుకు విద్యార్థులందరూ తప్పక హల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సెంటర్‌కు చేరుకోవాలని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చాట్రాయి ఎంపీడీఓగా దుర్గా ప్రసాదు



చాట్రాయి: స్థానిక ఎంపీడీఓగా కె.దుర్గాప్రసాదు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కంకిపాడు మండల పరిషత్ ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. మండల పరిషత్ సిబ్బంది ఆయన్ని అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఝాన్సీరాణి, సూపరింటెండెంట్ మురళీమోహనరావు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి

ఎమ్మెల్యే రక్షణనిధి



శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తాతకుంట్ల (విస్సన్నపేట): జలజీవన్ మిషన్ పథకంలో అర్హులైన ప్రతి ఒక్క ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి, తాగునీరు సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. మండలంలోని తాతకుంట్ల గ్రామంలో రూ.24 లక్షలతో జలజీవన్‌మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు సంబంధించి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి రాఘవి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ పి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

నాణ్యమైన మిరపనారును మాత్రమే విక్రయించాలి



మాట్లాడుతున్న బాలాజీకుమార్

ఊటుకూరు(గంపలగూడెం): మిరపనర్సరీల యాజమాన్యం మిరప పెంపకంలో సరైన యాజమాన్యం పద్ధతులను పాటిస్తూ ఆరోగ్యవంతమైన మేలిరకమైన నారును మాత్రమే రైతులకు విక్రయించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి పి.బాలాజీకుమార్ తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం నర్సరీ యాజమాన్యంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంప్రకారం మాత్రమే మిరప నర్సరీలను నిర్వహించాల్సి ఉందన్నారు. రికార్డులలో తప్పక నమోదు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీలలో మొక్కల వద్ద ఆయా రకాల సంబంధించిన బోర్డులను రైతులకు తెలియపరిచే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. తిరువూరు ఏడీఏ కెనడీ, వ్యవసాయ అధికారి బి. సాయిశ్రీ, తిరువూరు ఉద్యానవనశాఖ అధికారి ఎస్ అహ్మద్, ఊటుకూరు పీఏసీఎస్ అధ్యక్షులు ఆలపాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలి



తిరువూరు గ్రంథాలయంలో శిక్షణ తరగతులు



స్పోకెన్ ఇంగ్లిష్‌పై మాట్లాడుతున్న రాంబాబు

తిరువూరు: విద్యార్థులు తమలోని నైపుణ్యాలు వృద్ధి చేసుకుని, సృజనాత్మక ధోరణితో వ్యవహరించాలని తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చిన సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్నతనం నుంచే పోటీతత్వం అలవరచుకోవాలని, అన్ని రంగాల్లో తమ ప్రావీణ్యం చూపాలన్నారు. భగవద్గీత పఠన పోటీల్లో చురుకుగా పాల్గొంటున్న విద్యార్థులను ఆమె అభినందించారు. తెలుగు భాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు భరతకుమారి, మహబూన్నీసా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన

రెడ్డిగూడెం: స్థానిక గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు విజ్ఞాన వినోద కథ సాగరం, బొమ్మలతో నీతి కథలు, పుస్తకాలు చదివించారు. తదుపరి బోండా రాంబాబు మాస్టారకు విద్యార్థులకు ప్రాచీనప్రపంచ చరిత్ర, స్పోకెన్ ఇంగ్లిష్, సైన్స్‌ను వివరిస్తున్నారు.. ఈ సందర్భంగా విద్యార్థులకు జీకే బిట్స్ చెప్పడం, క్యారం బోర్డు , చెస్, వాలీబాల్ ఆటలు ఆడించారు. గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

పెనుగొలను(గంపలగూడెం): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలను శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులను సన్మానించారు. తొలుత విద్యార్థులతో నీతి కథలు, సరదా కథలు చదివించారు. ప్రముఖ సాహితీవేత్త దాశరథి రంగాచారి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. వేసవి విజ్ఞాన శిబిరానికి రోజూ క్రమం తప్పకుండా హాజరైన విద్యార్థులకు శిరిడి సాయి సేవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయులు నరసింహరావు, నాగరాజు శిరిడిసాయి సేవా కమిటి ప్రతినిధి నారాయణరావు, గ్రంథాలయ నిర్వహణ అధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

డ్రోన్ పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సురేష్

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం రైతులకు, వ్యవసాయ సిబ్బందికి డ్రోన్ పనితీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్స్ అందిస్తోందని, రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ డ్రోన్ నడపటానికి ప్రభుత్వం ఉచితంగా పౌర సరఫరాలశాఖ ద్వారా అనుమతి పొందిన సంస్థ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురుడా కంపెనీ సిబ్బంది డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేయడం చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మల్లాది రాణీ పాల్గొన్నారు

లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనకు వచ్చిన లేగదూడలను పరిశీలిస్తున్న అధికారులు

జి.కొండూరు: మండలంలోని కవులూరు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం డీఎల్‌డీఏ ఉప సంచాలకులు డాక్టర్ కె శ్రీనివాసులు, మైలవరం ఏడీ హరిహరనాథ్, పశు వైద్యాధికారి డాక్టర్ కె మౌనిక పర్యవేక్షించారు. ఈ ప్రదర్శనలో భాగంగా పెయ్యదూడల ఆరోగ్య, అందాల విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన లేగ దూడల యజమానులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. అనంతరం పశుబీమాపథకం, పెయ్యదూడలు పుట్టే పథకం, జాతీయ కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ఉచిత వీర్య పథకం, దూడల సంరక్షణపై డిఎల్‌డిఎ ఉప సంచాలకులు శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా మరియమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొట్టిముక్కల ఓంకార్‌బాబు, వైస్ ఎంపీపీ ఈలప్రోలు తేజశ్విని, వైస్ సర్పంచ్ బొర్రా నరేంద్ర పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి



జికొండూరులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

జికొండూరు: జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహనిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీడీఓ అనురాధ, హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లాభసాటిగా వ్యవసాయ రంగం



బోరు పనుల ప్రారంభంలో సర్పంచ్ తదితరులు

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో వ్యవసాయ రంగం లాభసాటిగా సాగుతోందని సర్పంచ్ నక్కా కమల అన్నారు. వైఎస్సార్ జలకళలో భాగంగా రైతుల పొలాల్లో బోర్లు వేసే కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలనలో రైతులకు అన్నివిధాలా మేలు జరుగుతోందన్నారు. రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనం నుంచి విక్రయం ద్వారా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బాబు సుధారాణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోపూరి రామకోటేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు ఏఓగా మధుమోహన్

ముసునూరు: మండల వ్యవసాయాధికారిగా ఎస్.మధుమోహన్ బాధ్యతలను చేపట్టారు. ఆయన వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలోని ఎరువుల విభాగంలో వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిప్యూటేషన్‌పై పని చేసిన చేబత్తిన శ్రీనివాసరావు తాడేపల్లిగూడెంలోని సహాయ సంచాలకుల కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయాధికారిగా తిరిగి బాధ్యతలు చేపట్టనున్నారు. మధుమోహన్ ముందుగా నూజివీడు ఏడీఏ విద్యాసాగర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

నేడు ఫిష్ ఆంధ్రా మార్కెట్‌కు శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: స్థానిక ఫెర్రీ గ్రామంలో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారుల కోరిక మేరకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్ర మార్కెట్ సముదాయానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేస్తారని సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహన రావు గురువారం తెలిపారు. మత్స్యకార కుటుంబాల సభ్యులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వేతనాలు పెంచాలని వినతి

తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల కనీస వేతనం రూ.15వేలకు పెంచాలని తిరువూరు మండల ఆయాల సంఘ ప్రతినిధులు గురువారం ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఆయాలకు పనికి తగిన వేతనం చెల్లించాలని సంఘ గౌరవాధ్యక్షుడు నాగుల్ మీరా, అధ్యక్షుడు మాలపాటి ఉదయ్ కోరారు. ప్రభుత్వం ఈ విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఎంఈఓ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నందిగామ: రాత్రి సమయంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పౌరసరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ రామ్మూర్తి రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం చందర్లపాడు ప్రాంతం నుంచి ఆటోలో 50 మూటలు (సుమారు 25 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి సమయంలో చందర్లపాడుకు చెందిన ఓ వ్యాపారి వేరే ప్రాంతానికి తరలిస్తున్నాడు. సమాచారం రావడంతో విజిలెన్స్ సీఐ వసంత బాబు తమ సిబ్బందితో వచ్చి చందర్లపాడు మండలం తుర్లపాడు రోడ్డులో ఆటోను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని ఆటోను చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు డీటీ రామ్మూర్తి రెడ్డి తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. నగరానికి చెందిన డాక్టర్ పార్వతిదేవి దంపతులు ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116ల విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.